ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -68 పేజీలు - 8 వెల - 03/- శనివారం 27 జూన్ 2026

# మనమిత్ర తో డిజిటల్ సేవలు




### ఆధార్ నంబర్‌తోనే అన్ని సర్టిఫికెట్ల డిజిటల్ వెరిఫికేషన్

**ఆధార్ నంబర్ కొడితే చాలు.. అన్ని వివరాలు రావాలి: మంత్రి నారా లోకేశ్**


**ఆర్టీజీఎస్ సేవలపై మంత్రి నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష**

**మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన**

**కుల, ఆదాయ ధృవపత్రాల జారీ ప్రక్రియ మరింత సులభతరం**

**డేటా లేక్ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారం అనుసంధానం**

**ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ఠ చర్యలకు ఆదేశం**



**అమరావతిజూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**
కేవలం ఆధార్ నంబర్ ఎంటర్ చేయగానే, ఒక అభ్యర్థికి సంబంధించిన అన్ని రకాల విద్య, క్రీడా సర్టిఫికెట్లు డిజిటల్‌గా వెరిఫై అయ్యే పారదర్శకమైన, పటిష్ఠమైన వ్యవస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ సులభతరం అవ్వడమే కాకుండా, రాబోయే వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో లక్షలాది మంది అభ్యర్థులకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థి ఆధార్ నంబర్ కొట్టగానే, ఆ సర్టిఫికెట్‌ను ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు రియల్ టైమ్‌లో తెలిసేలా 'డిజి వెరిఫై' వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు.మిగతా 2లో...

# డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత



**ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి**

**ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం**

**ప్రజల జీవన ప్రమాణాల పెంపు**

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి**

**నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ**

**డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ**

**న్యూఢిల్లీ,జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు మిగతా 2లో...

# కొత్త కోర్కెలతో 'రొట్టెల పండుగ'

**నెల్లూరులో స్వర్ణాల చెరువు వద్ద చారిత్రక రొట్టెల పండుగ**

**మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వేడుక**

**ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు**

**20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా**



**నెల్లూరుజూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**
దేశవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన నెల్లూరు 'రొట్టెల పండుగ' (జూన్ 26) ఘనంగా ప్రారంభం కానుంది. అయితే, ఒక రోజు ముందు నుంచే భక్తుల కోలాహలం మొదలైంది. స్వర్ణాల చెరువు ఒడ్డున ఉన్న చారిత్రక బారాషహీద్ దర్గా వేదికగా ఐదు రోజుల పాటు జరిగే ఈ వార్షిక మహోత్సవానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు దేశ విదేశాల నుంచి సైతం లక్షలాదిగా తరలివస్తున్నారు. దీంతో స్వర్ణాల చెరువు కళకళలాడుతోంది.మిగతా 2లో...

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు...

**రాహుల్ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు**

**'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్**

**రాహుల్ ప్రపంచస్థాయి నాయకుడని కాంగ్రెస్ కౌంటర్**

**బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**న్యూఢిల్లీ,జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**
ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలుమిగతా 2లో...



# ఆపరేషన్ సిందూర్ లో ఆరుగురు అమరులు

**ఏడాది తర్వాత జవాన్ల పేర్లు ప్రకటించిన కేంద్రం**

**నేషనల్ వార్ మెమోరియల్ వెబ్‌సైట్‌లో 'రోల్ ఆఫ్ ఆనర్-2025'లో చోటు**

**తెలుగు అగ్నివీర్ మురళీ నాయక్ సహా ఆరుగురికి దేశం నివాళి**

**న్యూఢిల్లీ,జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆరుగురు అమరవీరుల పేర్లను కేంద్ర ప్రభుత్వం తొలిసారి అధికారికంగా వెల్లడించింది. దేశ రక్షణలో అసమాన




# తాడిపత్రిలో మళ్లీ ఉద్రిక్తత..

## పెద్దారెడ్డి గృహనిర్బంధం

**గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేపడతామన్న పెద్దారెడ్డి వర్గీయులు**

**వైసీపీ దీక్షను అడ్డుకుంటామన్న జేసీ వర్గీయులు**

**తాడిపత్రిలో భారీగా మోహరించిన పోలీసులు**


2లో.



# పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్ల పండగ..

**42 మంది ఎంపీడీవోలకు డీడీవోలుగా పదోన్నతులు**

**కూటమి ప్రభుత్వం వచ్చాక 10 వేల మందికి ప్రమోషన్లు**

**వర్షాకాలంపై అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష**

**సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం**

**అమరావతిజూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**
ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆ శాఖ అధికారులకు మరో తీపికబురు అందించారు. తాజాగా 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు (ఎంపీడీవోలు), డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా (డీడీవోలు) పదోన్నతులు కల్పించే ప్రక్రియకు మిగతా 2లో...

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

**సీఎం సలహాదారుడిగా రామకృష్ణారావు**

**మొత్తం 13 మంది ఐఏఎస్‌ల బదిలీ.. ఉత్తర్వులు జారీ**



**హైదరాబాద్‌జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**
రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కె.రామకృష్ణారావు మిగతా 2లో...

# దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం..

**ఇకపై బయలుదేరే ఎయిర్‌పోర్టులోనే అంతర్జాతీయ ప్రయాణ లాంఛనాలు**

**వారణాసి నుంచి తొలి 'ఈజీ కనెక్ట్' విమాన సర్వీస్ ప్రారంభం**

**టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు సులభతరం**



**న్యూఢిల్లీ,జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**
టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా 'ఈజీ కనెక్ట్' విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి మిగతా 2లో...

# తాడిపత్రిలో మళ్లీ ఉద్రిక్తత..

**తాడిపత్రి/అనంతపురం జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**

అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గాలు పోటాపోటీగా నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తగా పెద్దారెడ్డిని గృహనిర్బంధం చేశారు.

పూర్తి వివరాల్లోకి వెళితే... తాడిపత్రిలోని ప్రధాన కూడలి అయిన గాంధీ విగ్రహం వద్ద సామూహిక దీక్ష చేపడతామని పెద్దారెడ్డి వర్గీయులు ప్రకటించారు. అయితే, ఈ దీక్షను ఏమాత్రం సాగనివ్వబోమని, తాము అడ్డుకుంటామని జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులైన టీడీపీ నేతలు స్పష్టం చేశారు. ఇదే సమయంలో జేసీ వర్గం మరో అడుగు ముందుకేసి.. అనంతపురంలో ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యేల ఇళ్ల ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేస్తామని ప్రకటించడంతో పరిస్థితి మరింత వేడెక్కింది.

జిల్లాలో ఒకవైపు మొహరం వేడుకలు, మరోవైపు వీవీఐపీల పర్యటనలు ఉండటంతో... ఇరువురు నేతల కార్యక్రమాలకు అదనపు రక్షణ కల్పించడం సాధ్యం కాదని పోలీసులు తేల్చి చెప్పారు. ఇరు వర్గాల నిరసనలకు అనుమతి నిరాకరించారు. ప్రజా శాంతికి సహకరించాలంటూ ఇరుపక్షాల నేతలకు ముందస్తుగా లీగల్ నోటీసులు జారీ చేశారు.ఇందులో భాగంగానే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు ఆయన ఇంట్లోనే గృహ నిర్బంధం చేశారు. ఆయన నివాసం చుట్టూ, అలాగే తాడిపత్రిలోని గాంధీ సర్కిల్, సున్నితమైన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తగా భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

# పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్ల పండగ..

**మొదటి పేజీ తరువాయి**

పచ్చజెండా ఊపారు. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదించింది. దీంతో త్వరలోనే వీరందరూ ఉన్నత హోదాలో బాధ్యతలు చేపట్టనున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందికి ప్రమోషన్లు కల్పించారు. గత పదేళ్లలో ఇంత భారీ సంఖ్యలో ఈ శాఖలో పదోన్నతులు ఇవ్వడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.

**వర్షాకాలంపై కీలక సమీక్ష.. పవన్ కీలక ఆదేశాలు**

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

“వర్షాకాలంలో నిలిచి ఉన్న నీటితో దోమలు పెరిగి, పైపులైన్ల లీకేజీల వల్ల తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామ పంచాయతీ ప్రజారోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. అన్ని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు అందుబాటులో ఉంచి, అవసరమైన చోట తక్షణం వినియోగించాలి“ అని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

# రాహుల్ గాంధీపై ‘మిస్సింగ్‘ పోస్టర్లు

**మొదటి పేజీ తరువాయి**

సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉధృతం చేసింది.

ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. “ఛడ్ దే ఇండియా“, “రాహుల్ ఇన్ పారిస్“, “పరదేశ్“ వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను ‘పర్యటనల నేత‘గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ “స్వదేశ్ వర్సెస్ పరదేశ్“ పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది.బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఆహ్వానాలు అందుతుంటాయని పేర్కొంది.ఇవన్నీ కేవలం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలని కొట్టిపారేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయంపై స్పందిస్తూ, “రాహుల్ గాంధీ కేవలం మన దేశ నాయకుడే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ను గొప్ప నాయకుడిగా భావిస్తారు. అందుకే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆయనకు నిరంతరం ఆహ్వానాలు వస్తుంటాయి“ అని స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

**మొదటి పేజీ తరువాయి**

ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన్ను సీఎం సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో రామకృష్ణారావు స్థానంలో సంజయ్ జాజు సీఎస్‌గా నియమితులయ్యారు. కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న ఆయన్ను తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ సబ్ కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫ రాల సంస్థ కమిషనర్‌గా పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీసులో ఉన్నారు. ఆయన 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు. కాగా రాష్ట్రంలో మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. చేనేత హస్తకళల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు బాధ్యతలు అప్పగించింది.

అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించిన ప్రభుత్వం.. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శిగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించింది. జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించింది. మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. రెవెన్యూ శాఖ (విపత్తు నిర్వహణ) ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జాను, ప్రభుత్వ (మైన్స్ అండ్ జియాలజీ) కార్యదర్శిగా ఎం.రఘునందన్ రావును, ఇన్వెస్ట్ తెలంగాణ, ఐ అండ్ సి డిపార్ట్ మెంట్ సీఈవోగా బి.అజిత్ రెడ్డిని నియమించారు. టీజీరెడ్కో వీసీ అండ్ ఎండీగా మహమ్మద్ ముషారఫ్ అలీ పారూఖీ, హ్యాండ్లూమ్స్, టెక్స్ టైల్స్, హ్యాండిక్రాఫ్ట్స్ ప్రత్యేక కార్యదర్శిగా పి.కాత్యాయని దేవి, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కె.గంగాధర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ గా టి.వెంకన్న, టూరిజం డైరెక్టర్ గా కె.విద్యాసాగర్ నియమితులయ్యారు. విద్యాసాగర్ సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ గా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. కె.చంద్రకళకు హెచ్ ఎండీఏ (కోర్ అర్బన్ రీజియన్, ల్యాండ్ పూలింగ్ అండ్ మెట్రో రైల్) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ గా ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణ అధికారిగా వినయ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డిని ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియమించింది.ం

# దేశంలో ‘ఈజీ కనెక్ట్‘ ప్రారంభం..

**మొదటి పేజీ తరువాయి**

రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు.ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారత విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. “భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా, స్వయం సమృద్ధి కలిగిన ఏవియేషన్ రంగాన్ని నిర్మించడంలో ఇది ఒక కీలక ముందడుగు“ అని ఆయన తెలిపారు.ఈ ‘ఈజీ కనెక్ట్‘ వ్యూహంతో 2030 నాటికి భారత్‌ను ప్రయాణికులకు ప్రాధాన్య ఏవియేషన్ హబ్‌గా, 2047 నాటికి గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు పెరిగి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీని ద్వారా 2030 నాటికి దాదాపు 4 లక్షల ఉద్యోగాలు, 30 బిలియన్ డాలర్ల అదనపు జీడీపీ సమకూరుతుందని అంచనా.

# కొత్త కోర్కెలతో ‘రొట్టెల పండుగ’

**మొదటి పేజీ తరువాయి**

కులమతాలకు అతీతంగా, హిందూ-ముస్లిం ఐక్యతకు నిలువెత్తు రూపంగా నిలిచే ఈ పండుగ కోసం జిల్లా యంత్రాంగం అన్ని రకాల భారీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

**చారిత్రాత్మక నేపథ్యం నమ్మకం**

బారాషహీద్ దర్గాకు దాదాపు 415 సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉంది. ఒక గొప్ప ఆశయం కోసం ప్రాణత్యాగం చేసిన 12 మంది అమరవీరుల స్మృత్యర్థం ఈ దర్గా నిర్మితమైంది. గతంలో ఆర్కాటు నవాబు భార్య తీవ్ర అనారోగ్యానికి గురికాగా, ఈ దర్గాను దర్శించుకున్న తర్వాత ఆమె పూర్తిగా కోలుకున్నారని చరిత్ర చెబుతోంది. దానికి కృతజ్ఞతగా నవాబు దంపతులు స్వర్ణాల చెరువు వద్ద భక్తులకు రొట్టెలను పంపిణీ చేశారు.

నాటి నుంచి ఈ సంప్రదాయం ఒక ఆచారంగా మారింది. తమ కోర్కెలు (ఉద్యోగం, వివాహం, ఆరోగ్యం, సంతానం, విద్య, వ్యాపారం మొదలైనవి) నెరవేరిన భక్తులు స్వర్ణాల చెరువులో దిగి మొక్కుబడిగా రొట్టెలను సమర్పిస్తారు (ఇస్తారు). కొత్తగా కోర్కెలు కోరుకునే వారు ఆ రొట్టెలను అందుకుంటారు (పుచ్చుకుంటారు). ఈ రొట్టెల మార్పిడే ఈ పండుగలోని ప్రధాన ఆకర్షణ. 2015లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వేడుకను ‘రాష్ట్ర పండుగ’గా గుర్తించింది.



**పండుగ ముఖ్య విశేషాలు.. షెడ్యూల్**

నేటి నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ వేడుకల్లో రోజువారీ కార్యక్రమాలు ఇలా సాగనున్నాయి:

జూన్ 26: ‘సందల్ మాల్’ (గంధం పూసే పవిత్ర కార్యక్రమం)తో పండుగ అధికారికంగా ప్రారంభమవుతుంది.

జూన్ 27: దర్గా ప్రాంగణంలో ‘గంధ మహోత్సవం’.

జూన్ 28: ప్రధానమైన ‘రొట్టెల పండుగ’ రోజు. ఈ రోజున స్వర్ణాల చెరువు ఘాట్లలో భక్తులు భారీ సంఖ్యలో రొట్టెలను మార్పిడి చేసుకుంటారు.

జూన్ 29: ప్రత్యేక ప్రార్థనలతో కూడిన ‘తహ్‌లీల్ ఫాతెహా’.

జూన్ 30: అధికారిక ముగింపు వేడుకలు.

**ప్రభుత్వ ఏర్పాట్లు భద్రత**

ఈ ఏడాది పండుగకు దాదాపు 14 లక్షల నుంచి 20 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దర్గా అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 5 కోట్లు కేటాయించింది.

భక్తుల సౌకర్యార్థం స్వర్ణాల చెరువు వద్ద ప్రత్యేక ఘాట్లు, తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, మొబైల్ టాయిలెట్లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటు షికారు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల నేతృత్వంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలతో నిఘా ఉంచడంతో పాటు, ట్రాఫిక్ ఆంక్షలు, ప్రత్యేక పార్కింగ్ జోన్లను కూడా ఏర్పాటు చేశారు.

# మనమిత్ర తో డిజిటల్ సేవలు

**మొదటి పేజీ తరువాయి**

ఇది అధికారుల పనిని 99 శాతం సులభతరం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల పురోగతిని ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఒకేచోట క్రోడీకరించే ‘డేటా లేక్‘ పనులను జులై నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్ల సంఖ్యను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, వారిని తిరిగి బడికి రప్పించే మార్గాలను అన్వేషించాలని సూచించారు. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్‌తో అనుసంధానించాలన్నారు.

**ప్రజా సేవలు మరింత చేరువ కావాలి**

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు ‘మనమిత్ర‘ వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై నెలరోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సేవలను ఎలా వినియోగించుకోవాలి, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో ఉన్న అడ్డంకులను తొలగించాలని, రేషన్ కార్డుల విభజన, పేర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని స్పష్టం చేశారు.

**ఎల్‌నినో, విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తత**

రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జలవనరులు, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జలాశయాల్లో నీటి లభ్యత, భూగర్భజలాల స్థాయిని ఆర్టీజీఎస్‌లోని ‘అవేర్‘ విభాగం ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, ముఖ్యంగా రాయలసీమలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వర్షాభావ పరిస్థితుల వల్ల జల విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత

**మొదటి పేజీ తరువాయి**

సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే ‘జన్ ధన్’ పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# ఆపరేషన్ సిందూర్ లో ఆరుగురు అమరులు

**మొదటి పేజీ తరువాయి**

ధైర్యసాహసాలు ప్రదర్శించి వీరమరణం పొందిన ఆ జవాన్ల వివరాలను నేషనల్ వార్ మెమోరియల్ అధికారిక వెబ్‌సైట్‌లోని ‘రోల్ ఆఫ్ ఆనర్-2025’ జాబితాలో చేర్చారు. త్వరలో న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకంలో ప్రత్యేక శిలాఫలకాలపై వారి పేర్లను శాశ్వతంగా చెక్కనున్నారు.’ఆపరేషన్ సిందూర్’లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, భారత వైమానిక దళానికి చెందిన ఒకరు వీరమరణం పొందారు. వీరిలో సుబేదార్ మేజర్ పవన్ కుమార్ (10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్), రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ (4వ బెటాలియన్, జమ్మూ కశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ), లాన్స్ నాయక్ దినేశ్ కుమార్ (5 ఫీల్డ్ రెజిమెంట్), హవిల్దార్ సునీల్ కుమార్ సింగ్ (237 ఫీల్డ్ వర్క్‌షాప్), అగ్నివీర్ మురళీ నాయక్ (851 లైట్ రెజిమెంట్), భారత వైమానిక దళానికి చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్ ఉన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరి సేవలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి జాతీయ స్థాయిలో గౌరవించింది. ఈ అమరవీరుల్లో రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం దేశంలోని మూడో అత్యున్నత యుద్ధ పురస్కారమైన ‘వీర చక్ర’ను ప్రకటించారు. అలాగే భారత వైమానిక దళానికి చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్‌కు ‘వాయుసేన మెడల్’ ప్రదానం చేశారు. ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రక్షణ పురస్కారాల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ తల్లిదండ్రులు వీరచక్రను అందుకున్నారు.

దేశ రక్షణలో చూపిన అసాధారణ ధైర్యానికి గుర్తింపుగా ఈ పురస్కారాలను కేంద్రం ప్రకటించింది.ఈ ఆరుగురిలో తెలుగు వ్యక్తి అగ్నివీర్ మురళీ నాయక్ పేరు ఉంది. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాకు చెందినవారు. 2022లో అగ్నివీర్‌గా భారత సైన్యంలో చేరిన మురళీ నాయక్ తొలుత పంజాబ్, అసోంలో విధులు నిర్వహించారు. అనంతరం జమ్మూ కశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ‘ఆపరేషన్ సిందూర్’లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన యువ సైనికుడు దేశం కోసం ప్రాణత్యాగం చేయడం అప్పట్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.గత ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. దీనికి ప్రతీకారంగా భారత్ మే 7న ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్తాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై వైమానిక, సైనిక దాడులు నిర్వహించింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఈ ఆపరేషన్‌ను అత్యంత వ్యూహాత్మకంగా అమలు చేశాయి.

ఇప్పుడు అధికారికంగాడ

ఇప్పటి వరకు ‘ఆపరేషన్ సిందూర్’లో వీరమరణం పొందిన జవాన్ల వివరాలను అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా నేషనల్ వార్ మెమోరియల్ వెబ్‌సైట్‌లో వారి పేర్లను ‘రోల్ ఆఫ్ ఆనర్-2025’లో చేర్చడంతో ఈ ఆరుగురు అమరవీరుల త్యాగానికి దేశం అధికారిక గుర్తింపు ఇచ్చినట్లైంది. త్వరలో జాతీయ యుద్ధ స్మారకంలోని శిలాఫలకాలపై వారి పేర్లు శాశ్వతంగా చెక్కనుండటంతో భారత సైనిక చరిత్రలో వారి సేవలు చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన ఈ వీరజవాన్లకు యావత్ దేశం మరోసారి ఘనంగా నివాళులర్పిస్తోంది.

# స్వరా ఆస్పత్రిలో క్యాన్సర్ కు చికిత్స

## ఓపీడీ ప్రారంభించిన కన్సల్టేషన్ డాక్టర్ విశ్వనాథ్





**అనంతపురం ప్రతినిధి, జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్):**
రాయలసీమ ప్రాంత ప్రజలకు నాణ్యమైన క్యాన్సర్ వైద్య సేవలను స్థానికంగానే అందించాలనే లక్ష్యంతో అనంతపురంలోని శ్రీ స్వర ఆసుపత్రిలో ప్రత్యేక అంకాలజీ ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ)ను శుక్రవారం ప్రారంభించారు. బెంగళూరులోని అపోలో హాస్పిటల్స్ మెడికల్ అంకాలజీ విభాగం సహకారంతో ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ స్వరా ఆస్పత్రిలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.

**వ్యాధి పునరావృతం కాకుండా సమగ్ర సేవలు**

ఈ సందర్భంగా సీనియర్ అకాడమిక్ డాక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ అనంతపురం నగరంలోని శ్రీ స్వరా ఆసుపత్రిలో క్యాన్సర్ కు చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. బెంగళూరు, హైదరాబాద్ మహా నగరాలకు వెళ్లకుండా అనంతపురంలో క్యాన్సర్ చికిత్స సేవలు అందించేందుకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అందులో భాగంగా ఈ ఓపీడీ ద్వారా అనంతపురంతో పాటు శ్రీ సత్యసాయి, కర్నూలు, వైఎస్సార్ కడప తదితర జిల్లాల క్యాన్సర్ బాధితులకు నిపుణుల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ప్రత్యేక చికిత్స కోసం బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు తరచూ వెళ్లాల్సిన అవసరం తగ్గనుంది. శ్రీ స్వరా ఆసుపత్రిలో ప్రతి నెలా రెండుసార్లు అపోలో హాస్పిటల్స్ సీనియర్ మెడికల్ అంకాలజిస్టు డా. (ప్రొఫెసర్) విశ్వనాథ్ ఎస్ రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి వైద్య సలహాలు ఇవ్వనున్నారు. క్యాన్సర్ ప్రారంభ దశ నుంచే నిర్ధారణ, చికిత్స ప్రణాళిక, కీమోథెరపీ వంటి చికిత్సలు, అనంతరం వ్యాధి పునరావృతం కాకుండా పర్యవేక్షణ వంటి సమగ్ర సేవలు అందించనున్నట్లు వారు తెలిపారు.

**రోబోటిక్ సర్జరీ, టార్గెటెడ్ థెరపీ, అధునాతన చికిత్సలు**

డా. విశ్వనాథ్‌కు అంకాలజీ రంగంలో 18 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. అమెరికాలోని ప్రముఖ ఎండీ ఆండర్సన్ క్యాన్సర్ సెంటర్‌లో క్లినికల్ ఫెలోషిప్ పూర్తి చేసిన ఆయన, ఎండీ, డీఎం గోల్డ్ మెడలిస్ట్‌గా గుర్తింపు పొందారు. రక్త సంబంధిత క్యాన్సర్లు, ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయం, కాలేయం, తల-మెడ, మహిళల్లో వచ్చే వివిధ రకాల క్యాన్సర్ల చికిత్సలో విశేష అనుభవం కలిగి ఉన్నారు. అవసరమైతే అపోలోలో అధునాతన చికిత్స అవసరమైన పరీక్షలు, చికిత్సలు నిర్వహించడంతో పాటు క్లిష్టమైన కేసులను బెంగళూరులోని అపోలో హాస్పిటల్స్‌కు సమన్వయంతో రిఫర్ చేస్తారు. అక్కడ రోబోటిక్ సర్జరీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనోథెరపీ, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ వంటి అధునాతన చికిత్సలు పొందేలా ప్రత్యేక వైద్య బృందం సహకరిస్తుంది. అపోలో మెడికల్ అంకాలజీ అసోసియేట్ కన్సల్టెంట్ డా. శిరీష్ కుమార్ కూడా ఓపీడీ సేవల్లో పాల్గొంటారు.

**ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్స ప్రజలకు అందుబాటు**

శ్రీ స్వర ఆసుపత్రి సీనియర్ కార్డియాలజిస్టు డా. వి. రాకేష్, సీనియర్ జనరల్ సర్జన్ డా. ఎం.డి. నాయక్, ఎండీ డా. ఎం. శ్వేత ఆధ్వర్యంలో ఈ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను అనంతపురం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం అన్నారు. అపోలో హాస్పిటల్స్ సహకారంతో వైద్య సేవలను అందించడం ద్వారా రోగులు సమయం, ఖర్చు రెండింటినీ ఆదా చేసుకోగలుగుతారు అని డా. శ్వేత తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక మొహర్రం

## పాతూరు దర్గాలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రత్యేక ప్రార్థనలు -మైనార్టీల అభ్యున్నతికి దగ్గుపాటి కృషి ..మత పెద్దలు







**అనంతపురం సంక్షేమం, జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్):**
హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా పవిత్ర మొహర్రం పండుగ నిలుస్తుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మొహరం సందర్భంగా పాత ఊరులోని మాసూంబి సారాబీ దర్గా పీర్ల మకాంలో ఆయన సందర్శించారు. స్థానిక మత పెద్దల ఆహ్వానం మేరకు ఆయన దర్గాకు వెళ్లారు. భక్తులు, మత పెద్దలు, టీడీపీ నాయకులతో కలిసి సమాజ శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు.

**ముస్లింలకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు ముందుంటా**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ అనంతపురం నగరంలో 70వేలకు పైగా ముస్లింల జనాభా ఉందని.. ఇక్కడ హిందువులు, ముస్లింలు ఎంతో ఐక్యతతో ఉంటున్నారన్నారు. ఏ పండుగ వచ్చినా కలిసి చేసుకుంటూ తమలోని ఐక్యతను చూపుతున్నారన్నారు. అన్ని వర్గాలు సోదరభావంతో ఉండాలని ఆయన కోరుకున్నారు. ఏ పండుగ వచ్చినా ముస్లింలు ప్రేమతో ఆహ్వానిస్తుంటారని.. తాను కూడా వారి ఇళ్లకు వెళ్తుంటానన్నారు. అలాగే ముస్లింల పక్షాన టీడీపీ ఎప్పుడు పని చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రంజాన్ సందర్భంగా మసీదుల మరమ్మతులు, అక్కడ మౌళిక వసతుల కల్పన చేస్తున్నట్టు చెప్పారు. ముస్లింలకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తాను ముందుంటానని చెప్పారు. ఇప్పటికే సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల్లో సగం మందికి పైగా ముస్లింలు ఉన్నారన్నారు. మరోవైపు టీడీపీ నాయకులు, ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముస్లింల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ స్థాయి సమావేశంలో ముస్లింల కోసం ప్రత్యేక స్థలం, బడ్జెట్ కావాలని ప్రతిపాదన చేశారన్నారు. ఆయన ఇప్పటికే అసెంబ్లీ మైనార్టీల కమిటీలో సభ్యునిగా ఉన్నారని.. ఎప్పటికప్పుడు తమ సమస్యలపై స్పందిస్తున్నారన్నారు. ఉర్దూ అకాడమీతో పాటు వివిధ రూపాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలార్ భాష, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి మైనార్టీ నాయకులు నియాజ్ అహ్మద్, కరీముల్లా, మన్సూర్, ఇసాక్, ఖాజా, మైనార్టీ నాయకులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ ఇఫ్తార్ దావత్

## హిందూముస్లిం ఐక్యతకు ప్రతీక - అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ

**అనంతపురం సంక్షేమం, జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్):**
పవిత్రమైన ఆషూరా (మొహరం 10వ రోజు) సందర్భంగా అనంతపురం నగరంలోని అశోక్‌నగర్ ఖబరస్తాన్ మస్జిద్-ఏ-రహీమ్ ఖాద్రిలో శుక్రవారం ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రత్యేక ఇఫ్తార్ దావత్ ఘనంగా నిర్వహించారు. అశోక్‌నగర్ మిత్రబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా ఇఫ్తార్ చేసి ఆషూరా దినోత్సవ విశిష్టతను చాటిచెప్పారు. ఇస్లాం మతంలో ఆషూరా రోజుకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని, ఈ రోజున ఉపవాసం (రోజా) పాటించడం ద్వారా అల్లాహ్ అనుగ్రహం లభిస్తుందని మత పెద్దలు పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ దావత్‌లో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మస్జిద్ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షులు అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ విచ్చేశారు.

**యువత మత సామరస్యాన్ని కాపాడడంలో ముందుండాలి**

ఈ సందర్భంగా అధ్యక్షులు షకీల్ షఫీ మాట్లాడుతూ మతాలు వేర్వేరు అయినా మానవత్వం ఒక్కటేనని అన్నారు. దేశంలో శాంతి, సోదరభావం నెలకొనాలంటే ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో జీవించాలని సూచించారు. హిందూముస్లింలు పరస్పరం ప్రేమాభిమానాలతో కలిసి ఉంటే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. యువత మత సామరస్యాన్ని కాపాడడంలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు, మత గురువులు, యువకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అందరూ కలిసి ఇఫ్తార్ స్వీకరించి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇఫ్తార్ దావత్ విజయవంతం కావడానికి కృషి చేసిన అశోక్‌నగర్ మిత్రబృందం సభ్యులను పలువురు అభినందించారు.

# కళారత్న సింగమనేని తెలుగు రాష్ట్రాలకు మార్గదర్శి

### 83వ జయంతి వేడుకల్లో వక్తల నివాళి -రచయిత గుడిపాటి సూర్యంకు సత్కారం



**అనంతపురం సాహిత్యం, జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్):**
రైతు జీవితాన్ని తన కథల్లో సజీవంగా ఆవిష్కరించి, గ్రామీణ సమాజ సమస్యలను సాహిత్యంలో ప్రతిబింబించిన కళారత్న, ప్రముఖ కథా రచయిత కీర్తిశేషులు సింగమనేని నారాయణ తెలుగు రాష్ట్రాలకు మార్గదర్శకుడని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం సింగమనేని నారాయణ 83వ జయంతి సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు సింగమనేని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఆయన రచనల్లో మాండలిక భాష సహజంగా వినిపిస్తుంది**

ఈ సందర్భంగా డాక్టర్ రాధేయ, గోవిందరాజులు, తరిమెల అమరనాథరెడ్డి, గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి తదితరులు మాట్లాడుతూ సింగమనేని ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తిస్తూ ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించారని, విరసం, జనసాహితీ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన రచనల్లో మాండలిక భాష సహజంగా వినిపించినప్పటికీ భావ వ్యక్తీకరణ ఎంతో స్పష్టంగా ఉండేదని, రచయితలను ప్రోత్సహించడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారని కొనియాడారు.

**ఆయన సాహిత్య సేవలు అభినందనీయం**

సింగమనేని సాహిత్య స్ఫూర్తిని కొనసాగిస్తున్న కవి, రచయిత గుడిపాటి సూర్యంను తెలుగు వెలుగు సంస్థ శాలువాతో ఘనంగా సత్కరించింది. జ్ఞాపికతో పాటు పుస్తకాలను అందజేసి ఆయన సాహిత్య సేవలను అభినందించింది. కార్యక్రమంలో కోటిగారి వన్నప్ప, గోసల నారాయణస్వామి, మధురశ్రీ, మిద్దె మురళీకృష్ణ, గంగిరెడ్డి విశ్వనాథరెడ్డి, డాక్టర్ అంకె రామలింగయ్య, లక్ష్మీశ్యాం, చంద్రశేఖరశాస్త్రి, షేక్ రియాజుద్దీన్, డాక్టర్ జూటూరు షరీఫ్, పూజారి ఈరన్న, ఎర్రగుంట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రోగులకు పౌష్టిక ఆహారం అందజేత

## మానవత్వం చాటుకున్న ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్



**అనంతపురం / కళ్యాణదుర్గం సంక్షేమం, జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్):**
టీబీ వ్యాధిగ్రస్థులు ఆ వ్యాధి నుండి త్వరగా కోలుకునేందుకు పౌష్టిక ఆహారం ఎంతో అవసరమని ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని 90 మంది టీబీ రోగులకు, 17మంది హెచ్ ఐ వి వ్యాధి గ్రస్తులకు ఆరు నెలల పాటు పౌష్టికాహారాన్ని అందించే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఐదో నెల పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బెళుగుప్ప మండల విద్యాశాఖ అధికారి గోవింద రాజులు, డాక్టర్ శశికళ, డాక్టర్ జమిలా బేగం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారి చేతుల మీదుగా రోగులకు పౌష్టిక ఆహార కిట్లను వారు అందజేశారు.



**తమ ఆరోగ్యం మెరుగుదల : టీబీ రోగులు** –గత ఐదు నెలలుగా క్రమం తప్పకుండా అందుతున్న సహాయంతో తమ ఆరోగ్యంలో మెరుగుదల కనిపిస్తోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, తమకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, ట్రస్ట్ వైస్ చైర్మన్ సురేష్ కుమార్, సత్యనారాయణ, అబ్దుల్ వాహబ్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. సమాజంలోని నిరుపేదలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల సంక్షేమం కోసం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం చేపడుతున్న సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందించారు.

# బాలికల హాస్టల్ ఏర్పాటు చేయండి


## - విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన

**ఎమ్మిగనూరు, జూన్, 27,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఇంకొకటి బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని బాలికల విద్యార్థుల తల్లిదండ్రులు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా బాలికల విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎం ఎస్ జెడ్ పి హైస్కూల్లో సుమారుగా 3800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులము వలసకు వెళ్లే వారు ఉన్నాము. గనుక హాస్టల్ లో వార్డెన్ ని అడగగా అప్పటికే 400 మంది బాలికలు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. గనుక తల్లిదండ్రులు తరఫున బాలికల విద్యార్థులకు అదనంగా మరో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని లేదా ఎక్కువ సీట్లు పెంచండి అంటూ పై అధికారులను వేడుకుంటున్నామని తెలిపారు.

# జూన్ 30 వ తేదీన నంద్యాల జిల్లా స్థాయి రాపిడ్,బ్లిట్జ్ చెస్ పోటీలు.

### -శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ స్వామి వివేకానంద ఆడిటోరియంలో.

### -రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక.



**నంద్యాల జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా రాపిడ్,బ్లిట్జ్ జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30 వ తేదీ రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా స్థాయి రాపిడ్ అండ్ బ్లిట్జ్ చెస్ పోటీలు వేరు వేరుగా నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు,ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్. జి. రవికృష్ణ, జిల్లా చెస్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 29 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్ సైట్ లోఎంట్రీలు నమోదు చేసుకోవాలని,నంద్యాల జిల్లా ఎంపికైన క్రీడాకారులు త్వరలో కాకినాడ లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.
ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ 9010451585.

# పేదలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ

**రూ.1.15 కోట్ల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సవిత -రూ.13.40 కోట్ల సహాయ నిధులు అందజేత**





**శ్రీ సత్యసాయి ప్రతినిధి, జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్ ):** నిరుపేదల వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో భరోసానిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. పెనుకొండ నియోజకవర్గానికి చెందిన 121 మంది లబ్ధిదారులకు రూ.1.15 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు.

**సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సల కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఊరటనిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత 24 నెలల్లో పెనుకొండ నియోజకవర్గంలోని పేదలకు రూ.13.40 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేశామని తెలిపారు. పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో సహాయనిధులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, దీపం2 వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు అందుతున్నాయని చెప్పారు. మహిళల ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి సవిత పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువలు, వంతెనల నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా పీర్ల పండగ మహోత్సవం.









**రైల్వే కోడూరు జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**


ఓబులవారిపల్లి మండలంలోని చిన్న ఓరంపాడు, నూకనపల్లి, చెన్నరాజుపాడు, ముక్క వారి పల్లి, సంజీవపురం, వై కోట గ్రామాలలో పీర్ల పండుగ మొహరం సందర్భంగా అత్యంత వైభవంగా ముస్లిం సోదరులు హిందువులు మతాలకు అతీతంగా సోదర భావంతో నిర్వహించుకోవడం జరిగినది, చిన్నఓరంపాడులో జరిగిన పీర్ల పండుగ సందర్భంగా ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు వైఎస్ఆర్సిపి రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్, గుంతకల్లు రైల్వే డి ఆర్ సి బోర్డు సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి శుక్రవారం పీర్ల పండుగ మహోత్సవంలో పాల్గొన్నారు ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు పీర్ల పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు,. పీర్ల పండుగలో పాల్గొన్న ముక్కా వరలక్ష్మి, ఓబులవారిపల్లె మండలం వై కోట గ్రామంలో కులమతాలకు అతీతంగా జరుపుకున్న పీర్ల పండుగకు కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుముక్కా రూపానంద రెడ్డి సతీమణి రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ నాయకురాలు వరలక్ష్మి వేడుకలో పాల్గొన్నారు ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు అనంతరం వరలక్ష్మి మాట్లాడుతూ మొహరం సందర్భంగా జరుపుకునే పీర్ల పండుగ మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో ఈ వేడుకలు జరుపుకుంటారని ఐక్యమత్యానికి పీర్ల పండుగ ఒక గొప్ప ఉదాహరణ అని ఆమె అన్నారు చిన్న పెద్ద వృద్ధులు అందరూ కలిసి ఆనందోత్సాహంతో ఈ వేడుకను జరుపుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు తో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు

పీర్ల పండుగ పురస్కరించుకొని ప్రత్యేక పూజలు పాల్గొన్న రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్ గుంతకల్లు రైల్వే బోర్డ్ డిఆర్ఈసిసి మెంబెర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి.

తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం,ఓబులవారిపల్లి మండలం,చిన్నం ఓరంపాడు పంచాయతీ చిన్నం ఓరంపాడు పల్లి గ్రామంలో పీర్ల పండుగ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో "శ్రీ తల్లెం భరత్ కుమార్ రెడ్డి" గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నం ఓరంపాడు గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు, అజీమ్ రియాజ్, మహబూబ్ మరియు భక్తులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు భూమి కేటాయింపు రద్దు చేయాలి.

**-ఆర్ ఏ ఆర్ ఎస్ ను పరిరక్షించాలి.**



**నంద్యాల జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**

రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆద్వర్యంలో "సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు" చైతన్య గేయం ఆవిష్కరణ. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి రచించి, రూపొందించిన "సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు" సిద్ధాంతమా? లేక కేవలం నినాదమా? ప్రజలే నిర్ణయించాలి... సమాజమే ఆలోచించాలి... అనే సందేశాత్మక గేయాన్ని శుక్రవారం నంద్యాలలోని సమితి ప్రధాన కార్యాలయంలో అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతాంగ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ పరిశోధన కోసం ఏర్పాటు చేసిన ప్రజాహిత సంస్థలను పరిరక్షించి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులకు నిల్వ, మార్కెటింగ్, బ్యాంకింగ్ తదితర సేవలను విస్తరించాల్సిన నూనెపల్లె మార్కెట్ యార్డులోని విలువైన భూమిని రాజకీయ అవసరాలకు కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాయలసీమ రైతాంగ అభివృద్ధికి కీలకమైన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లో తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని కొనసాగించడం వల్ల వ్యవసాయ పరిశోధనలు, రైతులకు అందాల్సిన సేవలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజా సంస్థల భూములను ఇతర అవసరాలకు వినియోగించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు."సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు" అనే సిద్ధాంతాన్ని విశ్వసిస్తున్నామని చెప్పే పాలకులు, ప్రజాహిత సంస్థల ఆస్తులను రాజకీయ అవసరాలకు వినియోగించడం నిజంగా సిద్ధాంతమా? లేక కేవలం నినాదమా? అనే ప్రశ్నను ఈ గేయం సమాజం ముందుంచుతోందన్నారు.

ఈ ఉద్యమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, ప్రజా ఆస్తుల పరిరక్షణ, రైతాంగ సంక్షేమం, ప్రజా సంస్థల బలోపేతం కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు. రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రజా ఆస్తులను కాపాడేందుకు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల భూమి కేటాయింపును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, రైతాంగ ప్రయోజనాలను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థలం లో ఏర్పాటు చేసిన కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి, వ్యవసాయ పరిశోధన సంస్థను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, ప్రముఖ న్యాయవాది శంకరయ్య, ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, సహాయ కార్యదర్శి సురేష్, గాయకుడు నారాయణ గౌడ్, భాస్కర్ రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో ఢీకొని వృద్ధుడి దుర్మరణం



**శింగనమల / నార్పల క్రైమ్ , జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్)**

అతివేగం, నిర్లక్ష్యం కారణంగా ఆటో ఢీకొనడంతో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. శింగనమల నియోజకవర్గంలోని నార్పల మండల పరిధిలోని ముచ్చుకుంటపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ రెడ్డి (70) ఆటో ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో లక్ష్మీనారాయణ రెడ్డి గూగూడు గ్రామంలోని కుళ్లాయి స్వామి బావి వద్ద నుంచి ముచ్చుకుంటపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో గూగూడు నుంచి గంగనపల్లి వైపు వెళ్తున్న ఓ ఆటో వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో లక్ష్మీనారాయణ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతోఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బయ్యపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహం చోరి

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు**



**చౌడేపల్లి జూన్ 26 ప్రజా రిపబ్లిక్**

భక్తిశ్రద్ధలతో నిత్య పూజలు అందుకుంటున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అపశృతి చోటుచేసుకుంది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోని పంచలోహ విగ్రహంతో పాటు జంట దీపాంతరాలను దొంగలించుకున్న సంఘటన చోటుచేసుకుంది గ్రామస్తుల కథనం మేరకు... చౌడేపల్లి మండలం 29ఏ చింతమాకుల పల్లి పంచాయతీ బయ్యపల్లిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది నిత్య పూజలు అందుకుంటున్న స్వామి వారి ఆలయంలో కాపలాగా ఒక వ్యక్తిని ఉంచారు వ్యవసాయ పనుల నిమిత్తం కాపలాదారు రెండు రోజులుగా ఆలయానికి రాలేదు. ఈ క్రమంలో శుక్రవారం స్వామి వారి పూజ చేయాలని ఆలయ తలుపులు తెరిచి చూడగా సుమారు రూ 1.50 లక్షల విలువ చేయు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి పంచలోహ విగ్రహము జంట దీపాంతరాలు కనిపించలేదని అర్చకుడు గ్రామస్తులకు తెలియజేశాడు. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. గుర్తుతెలియని దుండగులు ఆలయ తలుపులు పగలగొట్టి లోపల ఉన్న పంచలోహ విగ్రహాలను దొంగలించుకుని వెళ్లినట్లు గ్రామస్తులు పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అమ్మవారి రాహుకాల అభిషేకానికి విశేష స్పందన



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 26 ప్రజా రిపబ్లిక్ న్యూస్**

శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన రాహుకాల అభిషేకానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది ఉదయాన్నే అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మకు విశేష అభిషేకము అలంకరణ రావించారు అనంతరం భక్తులు అమ్మవారి దక్షిణ కోసం బాలురు తీరారు రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో అమ్మవారికి వివిధ జలాలతో అభిషేకించారు ఈ విధంగా చేయడం వల్ల దంపతులతో పాటు లోకం సుభిక్షంగా ఉంటుందని భక్తుల నమ్మకం వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి రాహుకాల అభిషేకాన్ని తిలకించి అమ్మవారిని దర్శించుకున్నారు పాత కళ్యాణ కట్ట వద్ద ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార అర్చక సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

# రాయర 'దర్శన' ఆడియో గ్రాండ్ రిలీజ్

**- పిఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు చేతుల మీదుగా ఆవిష్కరణ**

**-అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు**




**మంత్రాలయం, జూన్, 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** లక్ష్మీ గణేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నిర్మితమవుతున్న కన్నడ చలనచిత్రం 'దర్శన' ఆడియోను శుక్రవారం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ముందు కారడర్ భాగంలో అంగరంగ వైభవంగా విడుదల చేశారు. శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి పరమపూజ్య శ్రీ సుబుదేంద్ర తీర్థులు చేతుల మీదుగా ఆడియో సీడీని ఆవిష్కరించారు. మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం కారిడార్‌లో ఏర్పాటు చేసిన వేదికపై ఈ కార్యక్రమం అత్యంత గ్రాండ్‌గా జరిగింది. పిఠాధిపతి ఆశీర్వచనం అనంతరం చిత్ర యూనిట్‌కు, పాటల రచయితలకు, సంగీత దర్శకులకు శుభాకాంక్షలు తెలిపారు. 'దర్శన' చిత్రంలోని పాటలు శ్రోతలను అలరిస్తాయని, చిత్రం విజయవంతం కావాలని పిఠాధిపతి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ "మంత్రాలయం పుణ్యక్షేత్రంలో, గురు రాఘవేంద్రుల సన్నిధిలో, సుబుదేంద్ర తీర్థులు ఆశీస్సులతో మా రాయర'దర్శన' ఆడియో రిలీజ్ కావడం మా అదృష్టం. కన్నడ, తెలుగు ప్రేక్షకులను అలరించే విధంగా పాటలు ఉంటాయి" అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు, సంగీత దర్శకుడు, గాయనీ గాయకులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆడియో ఫంక్షన్ సందర్భంగా మఠం ప్రాంగణం భక్తిభావంతో మార్మోగింది. రాయరా'దర్శన' చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ కార్యక్రమంలో మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్ లు ఎస్ కే శ్రీనివాస్ రావు, వెంకటేష్ జ్యోషి, ఐపి నరసింహ మూర్తి, పిఆర్ఓ వ్యాసరాజ్ ఆచార్, పురానిక్ స్వామి, కొనాపూర్ సురేష్, శ్రీ పతి స్వామి, శ్రీనిధి, తదితర మఠం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో తక్కువ వర్షపాతం

## కేంద్రం తాజా అంచనాలు

**న్యూఢిల్లీ, జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**



ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?÷-లకెమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

## 107 కోట్లతో చేపట్టిన హైడ్రా

**హైదరాబాద్, జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**నగరంలో వరదల కట్టడి, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీచెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ. 107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువులు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని కేవలం జలాశయాలుగానే కాకుండా, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలోనే బోటింగ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# వెనిజులా విలయం !

**జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**




పర్యావరణ విధ్వంసం కూడా భూకంపాలకు కారణమై ఉండొచ్చని నిపుణులు కొందరు అభిప్రాయ పడుతున్నారు. జపన్ భూకంపాలకు నిలయం. అయితే ఇప్పుడు వెనిజువెలాలో జరిగిన భూకంప విలయం అంతా ఇంతా కాదు. ఏకకాలంలో పలు దేశాల్లో భూకంపాలు ఆందోళనకు గురిచేశాయి. ఇవి మానవులకు హెచ్చరిక కావాలి. వెనెజువెలాలో సంభవించిన రెండు భారీ భూకంపాలు అక్కడి ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ఒక్క నిమిషం వ్యవధిలో రెండు తీవ్ర భూకంపాలు రావడంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయి. ఇకపోతే లాటిన్ అమెరికా దేశం వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో మృతులు అంతకంత కూ పెరుగుతుండగా గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటం విచారకరం. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4300 మంది గాయపడి నట్లు తెలిపింది. భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40వేల మంది జాడ తెలియరాలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన లా గువేరాలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. భూకంపం ధాటికి ఈ తీర నగరం అతలాకుతలమైంది.ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస ప్రతినిధులు వెల్లడించారు. వీటి కింద చిక్కుకున్నవారిని గుర్తించడం కూడా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. శిథిలాలను తొలగించడానికి చాలా సమయం పడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు. భూకంపం నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. సోషల్ మీడియాతో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు 'ఎక్స్' అందుబాటులోకి వచ్చింది. 2024లో మదురో అధికారంలో ఉన్నప్పుడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకు వస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీన్ని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్,జర్మనీ,ఫ్రాన్స్, స్విట్జర్లాండ్,నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బంది, వైద్య సిబ్బంది, మానవతా సాయం అందించేందుకు సిద్ధమయ్యాయి. ఈ భూకంపాల ప్రభావం భారత్‌పై కూడా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల వాణిజ్యపరంగా ఆదేశంతో పలు ఒప్పందాలు జరిగాయి. ఇప్పుడు దెబ్బతిన్న వెనిజువెలాతో మనకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో వెనెజువెలా నుంచి భారత్ చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో భూకంపం వల్ల అక్కడి ఎగుమతి వ్యవస్థకు అంతరాయం కలిగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

భూ÷ఔకంపం కారణంగా వెనెజువెలా నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థలో సమస్యలు, అత్యవసర ఆంక్షలు అమలులోకి రావడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్‌కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే వెనిజువెలా కోలుకుంటేనే మళ్లీ వ్యాపార కార్యకలాపాలు ముమ్మరం కానున్నాయి. అందువల్ల అప్పటి వరకు భారత్ వ్యాపారాలకు దెబ్బగానే భావించాలి.

# అయోధ్య దొంగతనం కేసులో కీలక మలుపు!

## ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు రాజీనామా !

**న్యూఢిల్లీ, జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**సిట్ దర్యాప్తు అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో అయోధ్య రామ మందిర కానుకల చోరీ కేసు మరింత ముదిరింది. రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పుడు రాజీనామా చేశారు. ఆయనతోపాటు అనిల్ మిశ్రా కూడా తప్పుకున్నారు. విరాళాలు, కానుకల దొంగతనం ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇద్దరిపై రాజీనామా చేయాలని ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. అందుకే వారు తప్పుకున్నారు. రామ మందిర విరాళాల దొంగతనం కేసులో సిట్ నివేదిక నేపథ్యంలో, పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఎనిమిది మంది మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. మొహర్రం కారణంగా ఈరోజు కోర్టులకు సెలవు. అందువల్ల, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అనగా, సాధారణ కోర్టు పనివేళల వెలుపల, సెలవు దినాల్లో లేదా వారాంతాల్లో, అరెస్టు, రిమాండ్ లేదా బెయిల్‌కు సంబంధించిన అత్యవసర న్యాయపరమైన విషయాలను విచారించడానికి నియమించిన న్యాయమూర్తి.రామ మందిర కానుకల దొంగతనం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయిన అనంతరం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని



ఏర్పాటు చేయాలని ఆదేశించిందని ఆయన తెలిపారు. సిట్ వేగంగా దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించగా, వెంటనే కేసులు నమోదు చేశారు. ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే వారిని వదిలిపెట్టబోమని ఆయన అన్నారు. అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక. విశ్వాసాన్ని దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో కానుకల దొంగతనం జరిగింది. ఇది బహిర్గతమైన వెంటనే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఆ సిట్ నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో పలువురు గుర్తుతెలియని వ్యక్తులతోపాటు, ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, శ్రీ రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, శ్రీరామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను పేర్లు చేర్చారు. గుర్తించని ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా పేర్కొన్నారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద అభియోగాలు మోపారు.ఎఫ్ఐఆర్ నమోదైన వారందరూ ఆలయంలోని విరాళాలు, నగదు నిర్వహణతో ఏదో ఒక విధంగా ఆలయం ట్రస్ట్‌తో సంబంధం కలిగి ఉన్నారని చెబుతున్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి అయిన చంపత్ రాయ్‌కు తిన్ను యాదవ్ సహచరుడని చెబుతున్నారు. విరాళాల పెట్టె తాళాలు అతని వద్దే ఉన్నాయని విచారణలో వెల్లడైంది. అనుకల్ప్ మిశ్రా విరాళాలను లెక్కించేవాడు . లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాకు బంధువని చెబుతున్నారు. మనీష్ యాదవ్, తిన్ను యాదవ్ మేనల్లుడు. సుభాష్ శ్రీవాస్తవ నగదు లెక్కించేవాడు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవినాష్ శుక్లా కూడా పాలుపంచుకున్నాడు. కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా కూడా నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొన్న వ్యక్తులు చాలావరకు కానుకల లెక్కింపు, నగదు నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్న ఉద్యోగులేనని అర్థమవుతోంది. ఇది, వీరు వ్యవస్థలోని కింది స్థాయి వ్యక్తులు మాత్రమేనా, లేక ఈ వ్యవస్థ మొత్తం ఉన్నతాధికారుల ఆదేశాలు, రక్షణలో పనిచేస్తోందా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది.

# ఏపీలోభారీ వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్

**వాతావరణ మార్పుల ప్రభావంతో ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు**

**ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు**

**పలు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రానున్న రెండు రోజులు వర్ష ప్రభావం**

**జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**



వాతావరణ మార్పుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రేపటి (శనివారం) నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ... రేపు ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కూడా రానున్న కొద్దిరోజుల పాటు ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తన నివేదికలో పేర్కొంది.ఆదివారం (జూన్ 28) కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు వివరించారు. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో ప్రజలు చెట్లు, హోర్డింగ్‌ల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# ఈనెల 30న గిరిజన వర్సిటీ స్నాతకోత్సవం

## తొలి స్నాతకోత్సవానికి రానున్న రాష్ట్రపతి

**విజయనగరం, జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.**



విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం కోసం ఆమె ఈ నెల 30న రాష్ట్రానికి రానున్నారు. విశ్వవిద్యాలయానికి సంబంధించిన సొంత భవనాలు ఇంకా సిద్ధం కాకపోవడంతో, ఈ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి లోకేశ్? పాల్గొంటారు. రాష్ట్ర విభజన అనంతరం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి వద్ద సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపన జరిగింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విశ్వవిద్యాలయ స్థలాన్ని మెంటాడ దత్తిరాజేరు మండలాల సరిహద్దు ప్రాంతానికి మార్చారు అక్టోబర్ 2023లో కొత్తగా శంకుస్థాపన చేశారు. అయితే, ఆ తర్వాత ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, జూలై 2024లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా చినమేడపల్లి మర్రివలస గ్రామాల్లో 519 ఎకరాల విస్తీర్ణంలో రూ.834 కోట్ల వ్యయంతో భవనాలను నిర్మిస్తున్నారు. అకడమిక్ బ్లాక్‌లోని ఐదు భవనాలు పరిపాలనా భవనం (అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్) నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది భవనాలు అప్పగించిన వెంటనే తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. నాణ్యమైన నిర్మాణం జరిగేలా పర్యవేక్షణ కొనసాగుతోందని, వచ్చే ఏడాది నాటికి ప్రాజెక్ట్ మొత్తం పూర్తవుతుందని అధికారులు పేర్కొన్నారు.సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ భవనాలు ఇంకా వినియోగానికి పూర్తిగా సిద్ధం కానప్పటికీ తొలి స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రారంభ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 30న విశాఖపట్నం చేరుకుంటున్నారు. విజయనగరంలోని సెంట్రల్ యూనివర్సిటీ భవనాల నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంతో విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొంటారు. రాష్ట్రపతి పర్యటనకు ముందు విశాఖపట్నంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిజిత్ కిషోర్ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణ, ప్రోటోకాల్, భద్రత, వాహనాల పార్కింగ్, అతిథుల కోసం సీటింగ్ ఏర్పాట్లు అత్యవసర సేవలపై వారు అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

# సర్ ప్రక్రియకు పాస్‌పోర్ట్ చెల్లుబాటు

## ఎన్నికల సంఘం కీలక ప్రకటన

**న్యూఢిల్లీ,జూన్ 26 రిపబ్లిక్ న్యూస్.** తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో పాస్‌పోర్ట్ పాత్రపై కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఒక ముఖ్యమైన వివరణ ఇచ్చింది. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్న లేదా ప్రస్తుతం వివరాలను సవరించుకోవాలన్నా అవసరమైన 12 రకాల ధృవీకరణ పత్రాలలో పాస్‌పోర్ట్ కూడా ఒకటిగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ వివరణ సాధారణ ఓటర్లకు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎంతో ఊరటనిచ్చే అంశం. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 1967 పాస్‌పోర్ట్ చట్టాన్ని ఉటంకిస్తూ, పాస్‌పోర్ట్ అనేది కేవలం ప్రయాణ పత్రమే కానీ, అది పౌరసత్వానికి నిరూపణ కాదని పేర్కొంది. ఈ ప్రకటన సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ పౌరసత్వం విషయంలో సమస్యలు వస్తాయా? ఓటర్ల జాబితాలో పాస్‌పోర్ట్ ఆధారంగా పేరు నమోదు చేయడం సాధ్యం కాదా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమయ్యాయి. దీంతో ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది. ఎన్నికల సంఘం అధికారుల ప్రకారం, ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తి పేరు చేర్చడానికి ఆ వ్యక్తి భారతీయ పౌరుడై ఉండటం, నిర్ణీత వయసు కలిగి ఉండటం ప్రాథమిక సూత్రం. దీనిని నిరూపించడానికి ఓటరు నమోదు అధికారి కొన్ని పత్రాలను పరిశీలిస్తారు. ఈ పత్రాల జాబితాలో పాస్‌పోర్ట్ ఎప్పటి నుంచో ఉంది. అది అలాగే కొనసాగుతుంది. “ పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి గుర్తింపును, నివాసాన్ని ధృవీకరించే కీలక పత్రం. ఇందులో ఎలాంటి మార్పు లేదు” అని ఒక ఉన్నతాధికారి స్పష్టం చేశారు. గతంలో బిహార్‌లో జరిగిన ా×=, అసోంలో జరిగిన ప్రత్యేక సవరణలు, ఆ తర్వాత జరిగిన వివిధ దశల ఓటర్ల జాబితా సవరణలలో కూడా పాస్‌పోర్ట్‌ను ఒక ప్రామాణిక పత్రంగానే పరిగణించారు. గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి కొత్త విధానాన్ని తీసుకురాలేదని, పాత పద్ధతులే అమల్లో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంటే దశాబ్ద కాలంగా పాస్‌పోర్ట్ అనేది ఓటరుగా నమోదు కావడానికి ఒక నమ్మదగిన ఆధారంగా ఉంటూ వస్తోంది. చట్టపరంగా చూస్తే పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి భారత వెలుపలికి వెళ్లడానికి లేదా తిరిగి రావడానికి ఇచ్చే ప్రయాణ పత్రం. అయితే ఓటర్ల జాబితా తయారీ సమయంలో , సదరు వ్యక్తి వివరాలను సరిచూడటానికి అధికారులు కోరే 12 పత్రాలలో ఇది ఒకటి. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ దరఖాస్తుదారు సమర్పించిన ఈ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటు హక్కుపై నిర్ణయం తీసుకుంటారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసేటప్పుడు పాస్‌పోర్ట్ మాత్రమే కాకుండా, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి మరో 11 పత్రాలను కూడా ప్రభుత్వం అనుమతిస్తుంది. కేంద్ర ప్రభుత్వం కానీ, ఎన్నికల సంఘం కానీ పాస్‌పోర్ట్ ప్రాముఖ్యతను తగ్గించే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఓటరు నమోదు ప్రక్రియలో దరఖాస్తుదారు పత్రాలను అంగీకరించే పూర్తి అధికారం సంబంధిత అధికారులకు ఉంటుంది. పాస్‌పోర్ట్ సమర్పించినప్పుడు దాన్ని నిరాకరించడానికి వీలులేదని తాజా వివరణ ద్వారా స్పష్టమవుతుంది.

# చరిత్ర సృష్టించిన శ్రీచరణి

టీమిండియా స్పిన్నర్, తెలుగు తేజం శ్రీచరణి చరిత్ర సృష్టించింది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా నిలిచింది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో 4 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీయడం ద్వారా శ్రీ చరణి ఈ ఫీట్ సాధించింది. ఈ టోర్నీలో భాగంగా బుధవారం బంగ్లాదేశ్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో శ్రీచరణి రెండు వికెట్లు పడగొట్టింది. ఈ రెండు వికెట్లను ఆఖరి ఓవర్‌లో సాధించింది. ఆమె బౌలింగ్‌లో ధాటిగా ఆడబోయిన షోర్నా అక్తెర్, నహిదా అక్తెర్ వికెట్ పారేసుకున్నాడు. అంతకుముందు సౌతాఫ్రికా, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో మూడు వికెట్ల ఘనతను అందుకుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టింది. ఈ టోర్నీలో రెడ్ హాట్ ఫామ్‌లో ఉన్న శ్రీచరణి మొత్తం 12 వికెట్లతో సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా నిలిచింది. 17 ఏళ్ల మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే మరే ప్లేయర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు. ఈ క్రమంలో ఆమె భారత బౌలర్ పూనమ్ యాదవ్ రికార్డ్‌ను అధిగమించింది. 2020 మహిళల టీ20 ప్రపంచకప్‌లో పూనమ్ యాదవ్ 10 వికెట్లు తీసింది. ఈ జాబితాలో దయానా డేవిడ్(9-2010), పూనమ్ యాదవ్(8-2014), పూనమ్ యాదవ్(8-2018), రాధా యాదవ్(8-2018), ఫాతిమా సనా(8-2026) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.



అంతేకాకుండా సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో రెండు, అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా కూడా శ్రీచరణి నిలిచింది. పూనమ్ యాదవ్(2014, 2018), రాధా యాదవ్(2018), రేణుకా ఠాకూర్(2024) ఈ ఫీట్ సాధించారు. పాకిస్థాన్ ప్లేయర్ అలియా రియాజ్(2018), ఫతిమా సనా(2026), సాదికా ఇక్బాల్(2026) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. గతేడాది మహిళల వన్డే ప్రపంచకప్‌లోనూ 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టి భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. శ్రీచరణి(2/21) అద్భుత ప్రదర్శనతో పాటు షెఫాలీ వర్మ(34 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 53) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగడంతో బంగ్లాదేశ్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 136 పరుగులే చేసింది. జుయారియా ఫెర్డోస్(31 బంతుల్లో 5 ఫోర్లతో 33), నిగర్ సుల్తానా(27 బంతుల్లో 4 ఫోర్లతో 32), సోభనా మోస్ట్రే(26 బంతుల్లో 2 ఫోర్లతో 22) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో రాధా యాదవ్(3/28) మూడు వికెట్లు తీయగా.. రేణుకా సింగ్, నందని శర్మ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 16.5 ఓవర్లలో 5 వికెట్లకు 139 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. షెఫాలీ వర్మతో పాటు యస్తికా భాటియా(18 బంతుల్లో 3 ఫోర్లతో 23), జెమీమా రోడ్రిగ్స్(15 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26) విలువైన పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రితూ మోనీ రెండు వికెట్లు తీయగా.. మరుఫా అక్తెర్, రాబేయా ఖాన్, నహిదా అక్తర్ తలో వికెట్ తీసారు. నాలుగు మ్యాచ్‌ల్లో 3 విజయాలతో టీమిండియా గ్రూప్-1లో రెండో స్థానంలో కొనసాగుతోంది.

# తొలి ప్రాక్టీస్ సెషన్‌లో వైభవ్ సూర్యవంశీకి చేదు అనుభవం



బెల్ఫాస్ట్ చేరుకున్న భారత ఆటగాళ్లకు ఇక్కడి ప్రాక్టీస్ స్టేడియంలో సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ చేయడానికి కేటాయించిన ఒక పిచ్ వెనుక 'సైట్‌స్క్రీన్' లేకపోవడాన్ని మేనేజ్‌మెంట్ గుర్తించింది. బౌలర్ చేతి నుంచి వచ్చే బంతి బ్యాటర్‌కు స్పష్టంగా కనిపించాలంటే సైట్‌స్క్రీన్ తప్పనిసరి. అది లేకపోవడంతో ఇషాన్ కిషన్ వంటి సీనియర్ బ్యాటర్లతో పాటు ఇతర ఆటగాళ్లు కూడా బంతిని సరిగ్గా అంచనా వేయడానికి ఇబ్బంది పడ్డారు. దీనిపై భారత జట్టు ఆపరేషన్స్ మేనేజర్ వెంటనే స్పందించి, క్రికెట్ ఐర్లాండ్ అధికారులతో మాట్లాడి నిరసన వ్యక్తం చేశారు. దీంతో అప్రమత్తమైన స్థానిక నిర్వాహకులు ప్రాక్టీస్ సెషన్ వేగం పుంజుకోకముందే ఆ లోపాన్ని సరిదిద్దారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి ఇది టీమిండియాతో తొలి ట్రైనింగ్ సెషన్ కాగా.. సైట్ స్క్రీన్ కారణంగా అతడికి ఒక చేదు అనుభవంగా మారింది. ఈ గందరగోళం సర్దుమణిగిన తర్వాత, అందరి దృష్టి 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే నిలిచింది. సీనియర్ జాతీయ జట్టుతో తన కెరీర్‌లో మొట్టమొదటి నెట్ సెషన్‌లో పాల్గొన్న వైభవ్, తనపై ఉన్న భారీ అంచనాల ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనివ్వలేదు. ఎడమచేతి వాటం కలిగిన ఈ కుర్రాడు నెట్స్‌లో అత్యంత ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తూ, మైదానం నలుమూలలా క్లాసిక్ డ్రైవ్‌లు, తన మార్క్ అటాకింగ్ షాట్లతో అలరించాడు. పిచ్‌పై బౌన్స్ హెచ్చుతగ్గులుగా ఉన్నప్పటికీ సూర్యవంశీ సులువుగా సిక్సర్లు బాదడం విశేషం. సాధారణంగా క్రికెట్ హడావుడి పెద్దగా లేని బెల్ఫాస్ట్ నగరంలో వైభవ్ రాకతో ఒక్కసారిగా సందడి నెలకొంది. భారత సంతతికి చెందిన ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. నెట్స్ ముగిసిన తర్వాత వైభవ్‌తో సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌ల కోసం అభిమానులు ఎగబడ్డారు. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ వైభవ్‌కు సంరక్షకుడిగా నియమించిన రోమి భిందర్‌తో పాటు, వైభవ్ తల్లిదండ్రులు కూడా ఈ పర్యటనలో జట్టుతో పాటే ఉన్నారు. సరికొత్త టీ20 శకంలో అడుగుపెడుతున్న భారత్, ఈ మ్యాచ్‌లో వైభవ్‌కు తుది జట్టులో అవకాశం ఇచ్చి చరిత్ర సృష్టిస్తుందా.. లేదా ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ వంటి సీనియర్లతోనే బరిలోకి దిగుతుందా అనేది కొన్ని గంటల్లో తేలనుంది.

# నా లైఫ్‌లో చూసిన అత్యుత్తమ బ్యాటర్ కోహ్లీ

**- సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్**



సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. తన దృష్టిలో ప్రపంచపు అత్యుత్తమ టాప్ 3 బ్యాటర్లు ఎవరో వెల్లడించాడు. పైగా అందులో నంబర్ వన్ ప్లేస్‌లో మన టీమిండియా దిగ్గజ క్రికెటర్ ఉండటం విశేషం. ఇంతకీ డివిలియర్స్ ఎవర్ని అత్యుత్తమ బ్యాటర్లుగా పేర్కొన్నాడో ఇప్పుడు తెలుసుకుందాం.. భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ తన జీవితంలో చూసిన అత్యుత్తమ బ్యాటర్ అని ఏబీ డివిలియన్స్ అన్నాడు. ముఖ్యంగా ఒత్తిడితో కూడిన రన్ ఛేజ్‌లలో కోహ్లీ ప్రదర్శించే సంయమనం, టార్గెట్‌ని చేరుకునే స్కిల్, ఇన్నింగ్స్‌ను నియంత్రించే సామర్థ్యం అసాధారణమని కొనియాడాడు.ఒక ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మాట్లాడుతూ.. "నా జీవితంలో నేను చూసిన అత్యుత్తమ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ. అతని తర్వాతే రికీ పాంటింగ్, కుమార సంగక్కర వంటి దిగ్గజాలు వస్తారు" అని డివిలియర్స్ పేర్కొన్నాడు. కోహ్లీ ఆటలో కనిపించే నిలకడ, ఫిట్‌నెస్, మానసిక దృఢత్వం అతడిని ప్రత్యేక ఆటగాడిగా నిలబెట్టాయని చెప్పాడు. వన్డే క్రికెట్‌లో ఛేజింగ్ విషయానికి వస్తే కోహ్లీకి సాటే లేదని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. భారీ లక్ష్యాలను ఛేదించే సమయంలోనూ ఒత్తిడిని అధిగమించి జట్టును విజయతీరాలకు చేర్చే సామర్థ్యం కోహ్లీని ప్రపంచంలోనే అత్యుత్తమ ఛేజ్ మాస్టర్‌గా నిలబెట్టిందని పేర్కొన్నాడు.

# మాజీ కోచ్ మనుకు 35 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

క్రికెట్ ట్రైనింగ్ వచ్చిన మైనల్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో కేరళ క్రికెట్ అసోసియేషన్ మాజీ కోచ్ మనుకు 35 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. ఈ మేరకు తిరువనంతపురం పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. తిరువనంతపురంలోని శ్రీవరగం ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల క్రికెట్ కోచ్ మనుపై మొత్తం 6 పోక్సో కేసులు నమోదయ్యాయి. తన అకాడమీకి వచ్చిన చిన్నారులను లైంగికంగా వేధించాడనే అభియోగాలతో పోలీసులు ఈ కేసులు పెట్టారు.ఇందులోని రెండో కేసును విచారించిన తిరువనంతపురం ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అంజు మీరా బిర్లా.. నిందితుడు మనుకు 35 ఏళ్ల కఠిన కారాగా శిక్షతో పాటు రూ.66,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో 6 ఏళ్ల 9 నెలలు జైలులో గడపాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.ఈ కేసు వివరాల ప్రకారం ఓ బాధితురాలు 2018లో మను అకాడమీలో చేరింది. ఆ మైనర్ బాలికకు ప్రత్యేక ఫిట్‌నెస్ ట్రైనింగ్ ఇస్తానన్న నెపంతో జిమ్, బాత్రూమ్‌కు తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. అంతేకాకుండా రహస్యంగా ఆ బాలిక ఫొటోలు, వీడియోలు కూడా తీసాడు. ఒకవేళ ఆ విషయాన్ని బయటపెడితే ఆమె క్రికెట్ భవిష్యత్తును నాశనం చేస్తానని బెదిరించాడు. భయపడిన ఆ బాలిక 2019లో అకాడమీని విడిచిపెట్టింది. ఏళ్లు గడిచినా ఆ చిన్నారులు భయంతో మౌనంగా ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో తిరువనంతపురం వేదికగా జరిగిన మహిళల క్రికెట్ మ్యాచ్ సందర్భంగా కోచ్ మనును మళ్లీ చూసిన బాధిత విద్యార్థి భయంతో గట్టిగా ఏడ్చేసింది. ఆ తర్వాత జరిగిన విచారణలో మను లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది.

# నల్గొండ నైట్స్ వరుసగా రెండో విజయం

టీజీ20 లీగ్‌లో అనురాగ్ నల్గొండ నైట్స్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. తాజాగా వరంగల్ వారియర్స్‌తో మ్యాచ్‌లో నల్గొండ 91 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. నల్గొండ నిర్దేశించిన 260 పరుగుల భారీ ఛేదనలో వరంగల్ తేలిపోయింది. 14 ఓవర్లలో 168 రన్స్‌కే ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ పేరాల అమన్‌రావు (46 పరుగులు, 15 బంతుల్లో), మురుగన్ అభిషేక్ (44 పరుగులు) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడారు. నల్గొండ బౌలర్లలో నిషాంత్, వరుణ్ గౌడ్ చెరో 3, అనికేత్ రెడ్డి 2, అర్ఫాజ్, దివేశ్ సింగ్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఛేదనలో మూడో ఓవర్లోనే రెండు వికెట్లు తీలసి వరంగల్‌ను నల్గొండ కష్టాల్లోకి నెట్టింది. 2.3 ఓవర్ వద్ద హర్షిత్ చౌదరి (10) ఔట్ కాగా, ఆ తర్వాత బంతికే రిషికేత్ సిసోదియా (0)ను నిషాంత్ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత కెప్టెన్ పేరాల అమన్‌రావు (46 పరుగులు, 15 బంతుల్లో), మురుగన్ అభిషేక్ (31 పరుగులు) చెలరేగడంతో నాలుగు ఓవర్లకే వరంగల్ 70 రన్స్ చేసింది. దీంతో గాడిలో పడ్డట్లే అనిపించింది. కానీ ఐదో ఓవర్లో అమన్ రావు ఔటయ్యాడు. 6.6 ఓవర్ వద్ద భవేష్ సేత్ (22)ను దివేశ్ ఔట్ చేశాడు. కాసేపటికే 9.4 వద్ద మణి కిరణ్ (16) స్వల్ప స్కోర్‌కే ఔటయ్యాడు. దీంతో 10 ఓవర్లలోపే వరంగల్ 5 కీలక వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత వికెట్ల పతనం కొనసాగింది. 11వ ఓవర్లో అభిషేక్ ఔట్ అవ్వడంతో వరంగల్ ఓటమి దాదాపు ఖాయమైంది. 13వ ఓవర్లో కులకర్ణి, మన్నూరి పెవిలియన్ చేరగా, 14వ ఓవర్లో రెండో బంతికి హుస్సేన్, ఆరో బంతికి క్రాంతి ఔటయ్యారు. దీంతో వరంగల్ ఇన్నింగ్స్ ముగిసింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నల్గొండ నైట్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. గౌరవ్ రెడ్డి (80 పరుగులు), పాట్కూరి నితీశ్ రెడ్డి (84 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో అర్ఫాజ్ అహ్మద్ (33 పరుగులు, 14 బంతుల్లో), దివేశ్ సింగ్ (18 పరుగులు) మెరుపులు మెరిపించారు. దీంతో నల్గొండ స్కోర్ 250 పరుగులు దాటింది. వరంగల్ బౌలర్లలో మహ్మద్ మాలిక్ 2, ముదాసర్ హుస్సేన్, కులకర్ణి తలో 1 వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నల్గొండకు తొలి ఓవర్ ఐదో బంతికే షాక్ తగిలింది. ఓపెనర్ ప్రణవ్‌ను మహ్మద్ మాలిక్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో 7రన్స్‌కే 1 వికెట్ పడింది. అయితే వన్ డౌన్‌లో వచ్చిన నితీశ్ రెడ్డితో కలిసి గౌరవ్ విధ్వంసం సృష్టించాడు. ఈ ఇద్దరూ పోటీపడి మరీ బౌండరీలు బాదేశారు. ఈ క్రమంలోనే అర్ధ శతకాలు పూర్తి చేశారు. రెండో వికెట్‌కు ఈ జోడీ 65 బంతుల్లోనే 142 పరుగులు జోడించింది. 11.4 ఓవర్ వద్ద గౌరవ్‌ను ముదాసిర్ ఔట్ చేయగా, 15.1 వద్ద నితీశ్ రనౌట్ అయ్యాడు. అలా ఇద్దరు సెట్ బ్యాటర్లు సెంచరీలు మిస్ చేసుకున్నారు. ఇక చివర్లో రాహుల్ (31 పరుగులు, 18 బంతుల్లో) అర్ఫాజ్ చెలరేగి ఆడారు. వీళ్ల విధ్వంసానికి దివేశ్ సింగ్ మెరుపులు తోడవ్వడంతో జట్టు స్కోర్ 250 పరుగులు దాటింది. కాగా, ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లు ఆడిన నల్గొండకు ఇది రెండో విజయం. దీంతో పట్టిక (4 పాయింట్లు)లో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మూడు మ్యాచ్‌లు ఆడిన వరంగల్‌కు ఇది రెండో ఓటమి. ఇక ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ టీమ్ 4 పాయింట్లతో రెండో స్థానంలోఅన్నే పాయింట్లున్న రంగారెడ్డి మూడో ప్లేస్‌లో ఉన్నాయి. టాప్ 3 జట్లు 4 పాయింట్లతోనే ఉన్నా రన్‌రేట్ ఆధారంగా ఆయా ప్లేస్‌ల్లో ఉన్నాయి.



# ఆస్ట్రేలియాను మరోసారి ఓడిస్తాం

**టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ధీమా**

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ 2026 టోర్నీ తరహాలోనే ఆస్ట్రేలియాను మరోసారి ఓడిస్తామని టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ధీమా వ్యక్తం చేసింది. ఆసీస్‌ను ఓడిస్తే తమ ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని చెప్పుకొచ్చింది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పటిష్టమైన ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉంది. బంగ్లాదేశ్‌తో విజయానంతరం మాట్లాడిన హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ గెలుపుపై సంతోషం వ్యక్తం చేసింది. 'ఇది ఒక మంచి విజయం. మేం ఈ మ్యాచ్‌ను ఇంకాస్త ముందుగానే ముగించాల్సింది. అయినప్పటికీ 2-3 ఓవర్ల ఉండగానే విజయాన్ని అందుకోవడం చాలా మంచి విషయమే. మేం మా ఫీల్డింగ్‌పై చాలా శ్రమించాం. అయినా ఈ మ్యాచ్‌లో కొన్ని క్యాచ్‌లు చేజార్చాం. వచ్చే మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శనను చూపిస్తామని ఆశిస్తున్నాను. క్యాచ్‌లు వదిలిన ఆటగాళ్లు మా జట్టులోనే అత్యుత్తమ ఫీల్డర్లు, కానీ కొన్నిసార్లు ఇలా జరుగుతూ ఉంటుంది. నిరంతరం శ్రమిస్తూ.. క్యాచ్‌లు పడుతూ ఉంటే మైదానంలో సరైన పొజిషన్లలో ఉండగలం. ఈ మ్యాచ్‌లో మేం కొన్ని తప్పులు చేశాం. కానీ తదుపరి మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తామని ఆశిస్తున్నాను. ఇక ఆస్ట్రేలియాతో తలపడడానికి మేం పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. వారు మా అత్యుత్తమ ప్రత్యర్థుల్లో ఒకరు. ఇలాంటి టోర్నమెంట్‌లలో ప్రతి మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉన్నప్పుడు.. మన అత్యుత్తమ ప్రదర్శనను బయటకు తీయాలి. ఒకవేళ ఆస్ట్రేలియాపై మేం గెలిస్తే.. మాకు చాలా ఆత్మవిశ్వాసం వస్తుంది. గతంలో నవీ ముంబైలో సాధించిన విజయం మాకు ఎంతో నమ్మకాన్ని ఇవ్వడమే కాకుండా, మాకున్న కొన్ని అడ్డంకులను బద్దలు కొట్టింది.'అని వన్డే ప్రపంచకప్ విజయాన్ని హర్మన్‌ప్రీత్ కౌర్ గుర్తు చేసుకుంది. గతేడాది జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్-2లో టీమిండియా అద్వితీయమైన ప్రదర్శనతో చిరస్మరణీయమైన విజయాన్నిఅందుకున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఆసీస్ విధించిన 338 పరుగుల లక్ష్యాన్ని భారత్ 9 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) అజేయ శతకంతో ఈ మ్యాచ్‌లో సత్తా చాటింది. ఈ గెలుపు ఉత్సాహంతో ఫైనల్లో సౌతాఫ్రి కాను ఓడించి తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. మరోసారి అదే తరహా ప్రదర్శనతో తొలి టీ20 ప్రపం చకప్‌ను ముద్దాడాలనే కసితో హర్మన్ సేన ఉంది.






## మర్డర్ మిస్టరీలో తత్వం

మర్డర్ మిస్టరీ జానర్‌లో.. ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ ఇచ్చేందుకు సిద్ధమవుతోన్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటూ.. సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. సైతాన్ సంతానమే గ్రహణం రోజు పుట్టి సైకోలుగా ప్రవర్తిస్తుంటారనే పాయింట్‌ని బేస్ చేసుకుని, ఈ సినిమా రూపుదిద్దుకున్నట్లుగా ట్రైలర్‌లో చూపించారు. అలాంటి టైమ్‌లో పుట్టిన ఓ వ్యక్తి చేసే హత్యల చుట్టూ కథని నడిపిస్తూ.. నిజంగా ఆ హత్యలను ఆ వ్యక్తే చేస్తున్నాడా? లేదంటే వేరే ఎవరైనా చేయిస్తున్నారా? అనే క్యూరియాసిటీని పెంచేలా ఈ ట్రైలర్‌ని కట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ టాప్‌లో ట్రెండ్ అవుతోంది.

## కెరీర్ ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను : కృతి సనన్



కృతి సనన్ ఇటీవల 'కాక్‌టెయిల్-2'తో బాలీవుడ్‌లో భారీ హిట్ సాధించింది. ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమ నుంచి బంపర్ ఆఫర్ అందుకుంది. విజయ్ దేవరకొండ, శౌర్యువ్‌తో కలిసి పాన్ ఇండియా స్థాయి చిత్రంలో కీలక పాత్రలో నటించనుందనే వార్త హల్‌చల్ చేస్తోంది. మరోవైపు, ఓ ఇంటర్వ్యూలో కృతి తన 12 ఏళ్ల సినిమా ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది.

"ప్రారంభంలో చాలా కష్టాలు పడ్డాను. మోడలింగ్ రోజుల్లో నా మొదటి ఫొటో షూట్, మొదటి ర్యాంప్ వాక్ రెండూ పూర్తిగా ఫ్లాప్ అయ్యాయి. ఇంటికి వెళ్లి ఏడ్చాను. కానీ ఆపకుండా మళ్లీ ఆడిషన్లు చేశాను. ఆ పట్టుదలే నన్ను ఇక్కడి వరకు తీసుకొచ్చింది" అని గుర్తు చేసుకుంది. అంతేకాదు, బాలీవుడ్‌లోని నెపోటిజం పైనా కృతి తీవ్రంగా స్పందించింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ లాంటి స్టార్ కిడ్స్ లో టాలెంట్ ఉందని, కష్టపడి నిరూపించుకున్నారని చెప్పిన కృతి... టాలెంట్ లేని కొందరు కేవలం ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా 8-9 ఏళ్ల పాటు వరుసగా అవకాశాలు పొందడం అన్యాయమని మండిపడింది. బ్యాక్‌గ్రౌండ్ లేని నటీనటులు మొదటి 2-3 ఏళ్లలోనే హిట్‌లు కొట్టకపోతే ఇండస్ట్రీ వారిని పక్కకు నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మరో మూడు నెలల్లో వారణాసి పూర్తి

### ముఖ్యమైన షూటింగ్ పూర్తి చేశామన్న జక్కన్న



మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనామార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

## రణబాలి షూటింగ్‌లో విజయ్ గొంతెమ్మ కోర్కెలు

### సోషల్ మీడియా అసత్య ప్రచారాలను తిప్పికొట్టిన నిర్మాత



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్
టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## ఒకే ఫ్రేమ్‌లో చిరు, నాగ్, వెంకీ..

### ఖుష్బూ కూతురి పెళ్లిలో సందడి




ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆమె పెద్ద కుమార్తె అవంతిక వివాహం గోవాలో అత్యంత వైభవంగా జరిగింది. చెన్నైకి చెందిన వ్యాపారవేత్త శ్రవణ్ శ్రీనివాసన్‌తో అవంతిక వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గోవాలోని ఒక విలాసవంతమైన రిసార్ట్‌లో జరిగిన ఈ వేడుకకు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఈ వివాహ వేడుకలో టాలీవుడ్ సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ముగ్గురు కథానాయకులు తమ సతీమణులు సురేఖ, అమల, నీరజలతో కలిసి హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన ఈ తారలంతా నూతన దంపతులతో ఫొటోలు దిగి సందడి చేశారు. వీరితో పాటు బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, నటి త్రిష కూడా ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. దీంతో 80, 90ల నాటి తారలంతా ఒకేచోట చేరిన అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది.

ఖుష్బూకు టాలీవుడ్‌లోని ఈ ముగ్గురు అగ్ర హీరోలతో మంచి అనుబంధం ఉంది. 'కలియుగ పాండవులు' చిత్రంతో వెంకటేశ్, ఖుష్బూ ఇద్దరూ దాదాపు ఒకే సమయంలో కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత నాగార్జునతో 'కెప్టెన్ నాగార్జున' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటించారు. ఇక, చిరంజీవి నటించిన 'స్టాలిన్' సినిమాలో ఖుష్బూ ఆయనకు సోదరిగా కీలక పాత్ర పోషించారు. వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా వీరందరి మధ్య స్నేహబంధం కొనసాగుతోంది. వెండితెరపై ఒకరితో ఒకరు పోటీపడినా, నిజ జీవితంలో మంచి స్నేహితులుగా మెలిగే చిరు, నాగ్, వెంకీ.. తమ స్నేహితురాలి కుమార్తె వివాహంలో ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మా ఇంటి బంగారం కోసం సమంతను ఒప్పించా: రాజ్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. విడుదలైన తొలి వారం రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన ఈ సినిమా ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసేందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నిర్మాత, దర్శకుడు రాజ్ నిడిమోరు చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమంత వ్యక్తిగత జీవితం, కెరీర్, ఈ సినిమా ప్రయాణం గురించి ఆయన పంచుకున్న విషయాలు అందరినీ భావోద్వేగానికి గురిచేశాయి.మేము ఎన్నో హిందీ ప్రాజెక్టులు చేశాం. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'స్త్రీ' వంటి ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. కానీ 'మా ఇంటి బంగారం' ఇచ్చిన తృప్తి మాత్రం పూర్తిగా భిన్నం. ఈ సినిమా నాకు గుండెకు చాలా దగ్గరైంది. తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణ నాకు జీవితాంతం గుర్తుండిపోతుంది' అని రాజ్ చెప్పారు. సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన సవాళ్లను గుర్తు చేసుకున్న రాజ్, ఒక ఆసక్తికర విషయాన్ని కూడా వెల్లడించారు. ఈ సినిమా ప్రారంభమైన సమయంలో సమంత వ్యక్తిగత జీవితం, ఆరోగ్యంపై బయట ఎన్నో రకాల ప్రచారాలు జరిగాయి. ఆ సమయంలో ఆమె సినిమాలకు దూరంగా ఉండాలనే ఆలోచనలో ఉండేది. నిజానికి ఇక సినిమాలు చేయకూడదని కూడా అనుకుంది. అయితే కనీసం ఈ ఒక్క సినిమా అయినా చేయాలని నేనే బలవంతం చేసి ఒప్పించాను అని రాజ్ వెల్లడించారు.



## శని, ఆదివారాల్లో ప్రత్యేక ఎస్ఐఆర్ క్యాంపెయిన్

**ఓటరు జాబితా సవరణ వేగవంతానికి ప్రత్యేక చర్యలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 26)**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు నగరపాలక కమిషనర్, ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి చల్లా ఓబులేసు తెలిపారు. బుధవారపేట 122, 123, 124, ఖల్లా 192, 193 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎస్ఐఆర్ ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తూ 2002 ఓటరు జాబితాను 2026 జాబితాతో సరిపోల్చి ఎన్యూమరేషన్ ఫారాలు పూరింపజేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సహకారంతో ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఈఆర్వోలు, బీఎల్‌వోలకు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఓటరు సహకరించాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ గడువు సమీపిస్తున్నందున ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిపారు. విద్యావంతులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు కూడా తమ ప్రాంతాల్లోని ఓటర్లకు ఫారాలు పూరించడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు, సూపర్వైజర్లు అందుబాటులో ఉండి ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాల నివృత్తి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ కార్యక్రమాలు చేపడతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఆర్వో ధనుంజయ, సూపర్వైజర్లు వేణుప్రియ, రసూల్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## సే నో టు డ్రగ్స్ యెస్ టు లైఫ్ నినాదాలతో కర్నూలులో అవగాహన ర్యాలీ

**అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం**






**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 26)**
అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎం. సుధీర్ బాబు, ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి రాజశేఖర్ గౌడ్ నాయకత్వంలో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ సాగింది.
ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది "మత్తుపదార్థాలకు వద్దు చెప్పండి జీవితానికి అవును చెప్పండి అంటూ నినాదాలు చేస్తూ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయం చట్టరీత్యా నేరమని ప్రజలకు వివరించారు. డ్రగ్స్ వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం, సమాజం, రాష్ట్రం, దేశంపై తీవ్ర ప్రతికూల ప్రభావం ఉంటుందని అవగాహన కల్పించారు.
అనంతరం కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల శరీరంలోని అవయవాలు దెబ్బతిని, మనిషి కోలుకోలేని స్థితికి చేరుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, జయరాం నాయుడు, కిషోర్, ఎస్ఐలు దుర్గా నవీన్ బాబు, రెహానా, వెంకటరాజు, రవితేజ, మారుతి ప్రసాద్, శాఖ సిబ్బంది, ఈగల్ టీం సభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 28న పల్స్ పోలియో మహా కార్యక్రమం

**ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు**

**3.52 లక్షల మంది చిన్నారులకు లక్ష్యం**

**1,630 బూత్‌ల ఏర్పాటు - విస్తృత ప్రచారానికి అధికారులకు కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశాలు**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 26)**
జిల్లాలో జూన్ 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.
జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల 3,52,164 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం 1,630 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జూన్ 28న బూత్‌లలో పోలియో చుక్కలు వేయగా, ఆ రోజు మిస్ అయిన పిల్లలకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికి వెళ్లి వ్యాక్సిన్ అందజేస్తారని చెప్పారు.
పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పట్టణాల్లో ఆడియోవీడియో ప్రచారం, ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ప్రకటనలు, గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. జూన్ 27న పాఠశాలల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి, ప్రార్థనా సమావేశాల్లో పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించాలని, బ్లాక్‌బోర్డులపై తేదీలను ప్రదర్శించాలని డీఈవోను ఆదేశించారు.
అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వలస కార్మికుల పిల్లలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల పరిసరాల్లోని చిన్నారులకు కూడా పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
పోలియో వ్యాక్సిన్ నిల్వ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించిన కలెక్టర్, తల్లిదండ్రులందరూ జూన్ 28న సమీప పోలియో బూత్‌కు తమ చిన్నారులను తీసుకువచ్చి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.
టెలికాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, మెప్మా, విద్య, ఆర్టీసీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెండేళ్ల అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లండి

**: మంత్రి టీజీ భరత్ గుప్తా**

**కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభలో కార్యకర్తలకు మంత్రి పిలుపు**

**కర్నూలులో భారీ పెట్టుబడులు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచన**

**హైకోర్టు బెంచ్, కొత్త కలెక్టరేట్ భవనం ఏర్పాటు లక్ష్యమని వెల్లడి**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 26)**
కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కర్నూలు నగరంలోని మౌర్య ఇన్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరేలా నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
కర్నూలు నియోజకవర్గంలోని 33 వార్డుల్లో గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి జరుగుతున్నప్పటికీ వాటిని ప్రజలకు సమర్థంగా వివరించడంలో నాయకులు, కార్యకర్తలు వెనుకబడుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు వివరించి వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.
ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, అలాంటి ప్రచారాలను వెంటనే ఖండించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు మంత్రి సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు.
కర్నూలు జిల్లాకు భారీ పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటికే రిలయన్స్ రూ.7,000 కోట్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని, మరో ఫుడ్ పార్క్ స్థాపనకు కూడా సిద్ధంగా ఉందని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు భవిష్యత్తులో దాని విస్తరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
కర్నూలులోని సి-క్యాంప్ ప్రభుత్వ క్వార్టర్స్ ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు, నూతన కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో నాయకులు అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్ల తొలగింపులో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గీతా మాధురి, బీజేపీ కర్నూలు నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యప్రకాశ్, జనసేన జిల్లా అధ్యక్షుడు సురేష్, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నంద్యాల జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన షేక్ ఖాదర్ భాషా.




**నంద్యాల క్రైమ్ జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్):**
సాధారణ బదిలీలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా బదిలీ కాబడిన షేక్.ఖాదర్ బాషా శుక్రవారం నాడునంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రా.ఖాదర్ భాషా గారు జిల్లా పోలీస్ కార్యాలయంనకు రాగానే జిల్లా సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించారు. 2012 బ్యాచ్ కి చెందిన ఖాదర్ భాషా గారి స్వస్థలం అనంతపురం జిల్లా. ఈయన గతంలో నంద్యాల జిల్లాలోని డోన్ సబ్ డివిజన్ డిఎస్పీగా కర్నూలు డీస్పీ గా విధులు నిర్వహించారు. రంపచోడవరం, చిత్తూరు, విజయవాడ డిఎస్పీగా సేవలందించారు. అనంతరం అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ పొంది కోనసీమ జిల్లాలో సేవలందించడం జరిగింది. ప్రస్తుతం ఇంటలిజెన్స్ విభాగం నుండి బదిలీపై నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా నేడు బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

## విద్యార్థి దశలోనే డ్రగ్స్ అలవాట్లకు దూరంగా ఉండాలి.

..విద్యార్థి భవిష్యత్తు మత్తులో కాదు... లక్ష్యంపై ఉండాలి.

..మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించిన.

నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ కుమారి ఎం జావళి.






**నంద్యాల క్రైమ్ జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్):**అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలలో మాదకద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షేరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల పట్టణ కేంద్రంలో గల శ్రీ రామకృష్ణ డిగ్రీ & పీజీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి ప్రమాదకరమైన మత్తుపదార్థాలను యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టకూడదని, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. కాలేజీ విద్యార్థుల్లో డ్రగ్స్ అలవాటు ఎలా మొదలవుతుందో వివరిస్తూ, "కేవలం ఒకసారి ట్రై చేస్తే తప్పేముంది? ఒక్కసారికి ఏమవుతుంది?" అనే చిన్న ఆలోచన తో ఈ వ్యసనం రూపుదాల్చుతుందని వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తూ, అలా ఒక్కసారి సరదాగా ప్రారంభించిన వారిలో అత్యధికులు ఆ తర్వాత ఆ అలవాటును వదులుకోలేరని, తమకు తెలియకుండానే దానికి బానిసలుగా మారిపోతారని తెలిపారు. స్నేహితుల ఒత్తిడి కారణంగా కూడా చాలా మంది యువతీ యువకులు ఆల్కహాల్, సిగరెట్లు, గంజాయి వంటి చెడు అలవాట్ల వైపు ఆకర్షితులవుతున్నారని, అటువంటి సమయాల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ, దృఢమైన నిర్ణయాలతో వాటిని తిరస్కరించాలని, విద్యార్థి భవిష్యత్తు మత్తులో కాకుండా మనం ఎంచుకునే లక్ష్యం వైపు ఉండి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏఎస్పీ ఆకాంక్షించారు.

## జిల్లా వైసీపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

**అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి అరెస్ట్**

**పోలీసుల తీరుకు నిరసనగా అనంతలో ధర్నా -తాడిపత్రి ప్రయాణం అడ్డుకున్న పోలీసులు**



**అనంతపురం క్రైమ్, జూన్ 26,(రిపబ్లిక్ న్యూస్):**తాడిపత్రికి వెళ్లేందుకు సిద్ధమైన వైఎస్ఆర్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తాడిపత్రికి బయలుదేరేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు తాడిపత్రికి వెళ్లేందుకు బయలుదేరారు. అయితే వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం ముందు భారీగా పోలీసులు మోహరించారు. అనంతరం అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లో తరలించారు. ఈ సందర్భంగా పోలీసు వాహనాలను అడ్డుకునేందుకు కార్యకర్తలు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. మహిళా విభాగం నేతలను పోలీసులు అడ్డుకున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు. పోలీసుల తీరుపై కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అరెస్ట్ చేసిన నేతలను కోర్టు రోడ్డులోని అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి తరలించి గృహ నిర్బంధం చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీనికి నిరసనగా అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, పార్టీ శ్రేణులు కోర్టు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com